## లోయలో పడ్డ బస్సు.. 14 మంది దుర్మరణం

**మధ్యప్రదేశ్‌లో దుర్ఘటన**

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని డిండోరి జిల్లాలో బుధ-గురువారం మధ్య రాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం సంభవించింది. దాదాపు 34 మందితో ప్రయాణిస్తున్న పికప్ వాహనం సుమారు 40-50 అడుగుల లోతులోని లోయలో పడిపోయింది. సంక్లిష్టమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగింది. దుర్ఘటనలో 14 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, 20 మంది గాయపడ్డారు. గాయపడినవారిని షాహ్‌పుర సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో జబల్‌పూర్ తరలించారు.

## ఎయిరిండియాకు 30 లక్షలు జరిమానా

**'వీల్‌చైర్' ఘటనపై డీజీసీఏ చర్య**

న్యూఢిల్లీ: ముంబై విమానాశ్రయంలో ఓ వృద్ధునికి వీల్‌చైర్ సదుపాయం కల్పించడంలో విఫలమైన ఎయిరిండియాపై డీజీసీఏ భారీ జరిమానా విధించింది. ఫిబ్రవరి 12న ముంబై విమానాశ్రయంలో ఓ వృద్ధునికి వీల్‌చైర్ లేక టెర్మినల్ వరకు నడుచుకుంటూ వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. దీనిని తీవ్రంగా పరిగణించి ఎయిరిండియాకు రూ.30 లక్షలు జరిమానా విధించినట్లు డీజీసీఏ అధికారులు తెలిపారు.

## 'ఖనిజాలపై పన్ను అధికారం కేంద్రానికి లేదు'

న్యూఢిల్లీ: ఖనిజాల హక్కులపై పన్ను విధించే అధికారాన్ని భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని, ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఇచ్చిందని సుప్రీంకోర్టు గురువారం చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ స్పష్టత ఇచ్చింది. మైనింగ్ లీజులపై కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే రాయల్టీని పన్నుగా పరిగణించవచ్చునా? అనే అంశాన్ని ఈ ధర్మాసనం విచారించింది. ఈ రాయల్టీని పన్నుగా పరిగణించవచ్చునని 1989లో ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పింది.

# తోకా.. తోకా.. ఎటుపోయావ్?!



### 2.5 కోట్ల ఏండ్ల కిందటి వరకూ కోతులతో పాటు మనుషులకూ తోకలు

**కాలక్రమేణా కనుమరుగైన వైనం • కారణాలను వివరించిన శాస్త్రవేత్తలు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): మనిషి కోతి నుంచి వచ్చాడని చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకున్నాం. కోతులకు తోకలు ఉండటం ఇప్పుడు కూడా చూస్తున్నాం. అయితే, వాటి నుంచే వచ్చిన మనుషులకు మాత్రం తోకలు లేవు. ఎందుకని ఎప్పుడైనా ఆలోచించారా? అమెరికాలోని న్యూయార్క్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఇదే విషయంపై గత కొంతకాలంగా లోతైన పరిశోధనలు చేశారు. ఎట్టకేలకు 'తోక' రహస్యాన్ని ఇటీవల కనిపెట్టారు. వారి పరిశోధన ప్రకారం.. 2.5 కోట్ల సంవత్సరాల క్రితం వరకూ కోతులకు ఉన్నట్టే మనుషులకు కూడా తోకలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే, కాలక్రమేణా మనుషులు, ఏప్స్ (గొరిల్లా) లలో తోకలు క్రమంగా కనుమరుగైనట్టు గుర్తించారు. డీఎన్‌ఏలో కొత్తగా చేరిన ఏఎల్‌యూవై (జంపింగ్ జీన్స్ అని కూడా పిలుస్తారు) అనే ప్రత్యేక జన్యువుల కారణంగానే మనుషుల్లో తోకలు పెరుగడం నిలిచిపోయిందని, ఇదేసమయంలో జంపింగ్ జీన్స్ లేకపోవడంతో కోతులు, ఎలుకలు, పిల్లుల వంటి జీవుల్లో తోకలు పెరుగడం అలాగే కొనసాగుతున్నట్టు వివరించారు. అయితే, మనుషుల్లో జంపింగ్ జీన్స్ చేరడానికి గల కారణాలను కనుగొనాల్సి ఉన్నట్టు వెల్లడించారు. న్యూరల్ ట్యూబ్ లోపాల వల్ల జనన సమయంలోనే కేంద్ర నాడీ వ్యవస్థలో లోపాలు ఏర్పడతాయని పరిశోధనలో కనుగొన్నారు. ఈ లోపాలు కూడా కాకతాళీయంగా తోకలు కోల్పోయిన సమయంలోనే జరిగి ఉంటాయని భావిస్తున్నారు.

### ఎలా కనిపెట్టారు?

*పరిశోధనలో భాగంగా అప్పుడే పుట్టిన 63 ఎలుకలను తీసుకొన్న శాస్త్రవేత్తలు వాటిలోకి జంపింగ్ జీన్స్‌ను క్రమంగా ప్రవేశపెట్టారు. ఎలుకలు పెరుగుతున్న క్రమంలో వాటి తోకలు చిన్నగా మారిపోవడం అనంతరం శరీరంలో కలిసిపోవడం జరిగినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు.*

### తోక పొడవుల్లో తేడా ఎందుకు?

ఒక్కో జీవి తోక పొడవులో తేడా ఎందుకు ఉందన్న అంశంపై కూడా పరిశోధకులు అధ్యయనం చేశారు. డీఎన్‌ఏలో టీబీఎక్స్‌టీ అనే జన్యువుల మోతాదును బట్టి ఒక్కో జీవి తోక సైజులో మార్పు జరుగుతున్నట్టు వాళ్లు గుర్తించారు.

# 'సందేశ్‌ఖాలి' నిందితుడు షాజహాన్ అరెస్ట్

- **పార్టీ నుంచి ఆరేండ్లు సస్పెండ్ చేసిన తృణమూల్ కాంగ్రెస్**
- **మహిళలపై వేధింపులు, భూకబ్జా, ఈడీ అధికారులపై దాడి కేసుల్లో నిందితుడు**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: తృణమూల్ కాంగ్రెస్‌కు బలమైన మద్దతుదారు, భూకబ్జాదారుడు, సందేశ్‌ఖాలిలో లైంగిక వేధింపుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు షాజహాన్ షేక్‌ను గురువారం ఉదయం పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. షాజహాన్ గత 55 రోజులుగా పరారీలో ఉన్నాడు. సందేశ్‌ఖాలికి 30 కిలోమీటర్ల దూరంలోని మినాఖాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బమన్‌పుకూర్‌లోని ఓ ఇంటి నుంచి షాజహాన్ షేక్‌ను అరెస్ట్ చేసినట్టు బెంగాల్ డీజీపీ సుప్రతిమ్ సర్కార్ వెల్లడించారు. తన అనుచరులతో కలిసి షేక్ ఆ ఇంట్లో దాక్కున్నట్టు పోలీసులు తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి బసిర్హాట్ కోర్టుకు తరలించారు. కోర్టు షేక్‌కు 10 రోజుల రిమాండ్ విధించింది. సీఐడీ విచారణ కోసం పోలీసులు అతడిని కోల్‌కతాలోని భబానీ భవన్‌కు తరలించారు. షాజహాన్ షేక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారన్న సమాచారం బయటకు రాగానే సందేశ్‌ఖాలి వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

### అరెస్టు అయిన కొన్ని గంటలకే..

షాజహాన్ షేక్ అరెస్టు అయిన కొన్ని గంటలకే అతడిని పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్టు అధికార టీఎంసీ ప్రకటించింది. షాజహాన్ షేక్ నార్త్ 24 పరగణాల జిల్లా పరిషత్‌లో టీఎంసీ ప్రతినిధిగా ఉన్నాడు. సందేశ్‌ఖాలి అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కన్వీనర్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు.

### అరెస్ట్ టీఎంసీ నాటకం

రేషన్ కుంభకోణం కేసులో జనవరి 5న ఈడీ అధికారులపై దాడికి సంబంధించి నజత్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో షేక్‌ను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. అయితే షేక్ అరెస్ట్‌పై విపక్షాలు స్పందన మరోలా ఉన్నది. ఇతంతా ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిందని బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ కొట్టిపారేస్తున్నాయి.

### ఆయనపై ఎలాంటి సానుభూతి లేదు

పలు ఆరోపణల కింద గురువారం అరెస్ట్ అయిన షాజహాన్ షేక్‌కు బెయిల్ ఇవ్వాలని కోరుతూ అతని తరుపు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై కలకత్తా హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆయనపై ఎలాంటి సానుభూతి లేదని స్పష్టం చేసింది. గురువారం షాజహాన్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. తన క్లయింట్ ముందస్తు బెయిల్ కోసం పెట్టుకున్న దరఖాస్తు తిరస్కరణకు గురైందని, రాత్రి అతడిని అరెస్ట్ చేశారని న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి శివజ్ఞానం మాట్లాడుతూ ఈ వ్యక్తిపై 43 కేసులున్నాయి. తీవ్ర నేరారోపణలెదుర్కొంటున్న నిందితుడిపై ఎలాంటి సానుభూతి లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించటం గమనార్హం.



## చేప కొంచెం.. కూత ఘనం

పిట్ట కొంచెం.. కూత ఘనం అనే సామెత ఈ చేపకు సరిగ్గా సరిపోతుంది. ప్రపంచంలోనే అత్యంత చిన్న చేప అయిన డానియనెల్లా సెరెబ్రం.. మనిషి గోరు అంత ఉంటుంది. పక్కాగా చెప్పాలంటే 12 మిల్లీమీటర్లు. మయన్మార్ నీళ్లలో కనిపించే ఈ చేప కూత పెడితే చెవులు చిల్లులు పడాల్సిందే. శబ్దాల్ని చేయటంలో ఇది ప్రత్యేకతను కలిగి ఉందని బెర్లిన్‌కు చెందిన చారైట్ యూనివర్సిటీ సైంటిస్టులు చెబుతున్నారు. ఈ చేపలు140 డెసిబుల్స్ వరకు శబ్దం చేయగలవని, అంబులెన్స్ సైరన్, జాక్‌హ్యామర్ (డ్రిల్లింగ్ మిషన్) డ్రిల్లింగ్ శబ్దానికి ఇది సమానంగా ఉంటుందని చెప్పారు.

## గోధుమ, వరి.. పరిమితి తప్పనిసరి!

- **ఎంఎస్పీ కింద అపరిమిత సేకరణ సరికాదు**
- **ఆహార భద్రతకు సరిపడా ధాన్యాన్నే సేకరించాలి**
- **కేంద్రానికి నీతి ఆయోగ్ ప్యానెల్ సిఫారసు**




న్యూఢిల్లీ: నిర్ణీత పరిమితి లేకుండా గోధుమ, వరి పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడం సరికాదని, ఇది 'పంట మార్పిడి'పై ప్రతికూల ప్రభావం చూపుతుందని నీతి ఆయోగ్ పరిధిలోని వర్కింగ్ గ్రూప్ తెలిపింది. ఆహార భద్రత చట్టం, ఇతర సంక్షేమ పథకాల అవసరాలకు సరిపడా మాత్రమే వీటిని కొనుగోలు చేయాలని సిఫారసు చేసింది. ప్రధాన ఆహార ఉత్పత్తుల డిమాండ్, సప్లయ్‌ని విశ్లేషించి ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేసేందుకు ఏర్పాటైన 23 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ తాజాగా నివేదికను సమర్పించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్, హర్యానాలోని రైతన్నలు చలో ఢిల్లీ మార్చ్ నిర్వహిస్తున్న వేళ తాజా నివేదిక బయటకు రావడం గమనార్హం. ఒకవేళ మార్కెట్‌లో మిగులు ధాన్యం ఉన్నా, లేదా వరి, గోధుమ నుంచి రైతులు ఇతర పంటలకు మళ్లాల్సి వచ్చినా వారికి పరిహారం అందించవచ్చని కమిటీ పేర్కొన్నది.

## భూ కబ్జాను ప్రశ్నించినందుకు వివస్త్రను చేసి..

- **కర్ణాటకలో మహిళ పై దారుణం**
- **ఆలస్యంగా ఘటన వెలుగులోకి**

కగవాడ్ (కర్ణాటక), ఫిబ్రవరి 29: కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాష్ట్రంలో దారుణం చోటుచేసుకుంది. తన భూమి కబ్జాపై ప్రశ్నించిన ఒక మహిళను వివస్త్రను చేసిన ఘటన బెళగావి జిల్లా కగ్‌వాడ గ్రామంలో జరిగింది. బాధితురాలి కుమార్తె ఫిర్యాదుతో ఏడు నెలల తర్వాత గురువారం విషయం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన అప్పటి వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే ప్రభుత్వం ఒక మహిళకు ఇచ్చిన మూడెకరాల భూమిలోని 20 కుంటల భూమిని, రోడ్డు ప్రాంతాన్ని నిందితుడు ఆక్రమించుకున్నాడు. ఇదేమని ప్రశ్నించిన బాధితురాలిని గత ఏడాది జూలై 31న నిందితుడు వివస్త్రను చేసి అవమానపరిచాడు. ఆమె కుమారుడిని దారుణంగా కొట్టాడు. అదనపు ఎస్పీ శ్రుతి ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. కగ్‌వాడ్ తహశీల్దార్ బాధితురాలి వాంగ్మూలం తీసుకున్నారు. వివాదాస్పద భూమిపై సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

## కర్ణాటకలో మళ్లీ కులగణన సెగలు

- **సీఎంకు నివేదిక అందజేసిన ఓబీసీ కమిషన్**
- **లింగాయత్, వొక్కలిగ వర్గాల్లో వ్యతిరేకత**

బెంగళూరు, ఫిబ్రవరి 29: లోక్‌సభ ఎన్నికల ముందు కర్ణాటకలో కులగణన నివేదిక సీఎం సిద్ధరామయ్య చేతికి అందింది. సర్వే రిపోర్ట్‌ను ఓబీసీ కమిషన్ చైర్మన్ జైప్రకాశ్ హెగ్డే గురువారం సీఎంకు సమర్పించారు. సర్వే నివేదికలోని అంశాలు ఇంకా బహిరంగంగా ప్రకటించకపోయినప్పటికీ ఈ నివేదిక రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచనుంది. తన పదవీ కాలానికి చివరి రోజైన గురువారం ఓబీసీ కమిషన్ చైర్మన్ హెగ్డే మధ్యాహ్నం బెంగళూరులోని విధానసౌధకు వచ్చారు. సీఎం సిద్ధరామయ్యను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ నివేదిక సమర్పించినట్టు చెప్పారు. దాన్ని క్యాబినెట్‌లో ప్రవేశపెట్టి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్టు హెగ్డే వెల్లడించారు. రాష్ట్రంలో రాజకీయంగా ఆధిపత్య కులాలైన లింగాయత్, వొక్కలిగ కులాలు సర్వే నివేదికను వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. నివేదిక అశాస్త్రీయంగా ఉన్నట్టు ఆ వర్గాలు ఆరోపిస్తున్నాయి. వొక్కలిగ కులానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా గతంలో తన వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

